

సాక్షి ఒడిశా

బుధవారం । 15 । మే । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం మంగళవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,23,662లు, బంగారం 21 గ్రాముల 220 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



ఛాలెంజ్ ఓట్‌పై సీఈఓ స్పందన

ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల హడావుడిలో సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లలో వైరల్ అయిన ఛాలెంజ్ ఓట్‌పై సీఈవో నికుంజ బిహారీ ధొలొ స్పందించారు.

- 8లో



రాయగడలో 72.91 శాతం పోలింగ్

సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా జిల్లాలోని రాయగడ, గుణుపూర్, బిసంకటక్ శాసనసభ నియోజకవర్గాల్లో సోమవారం జరిగిన పోలింగ్ వివరాలను జిల్లా ఎన్నికల అధికారి మనోజ్ సత్యవాన్ మహాజన్ మంగళవారం ప్రకటించారు

- 8లో

తొలి విడత ఎవరిదో..?



- పోలింగ్ సరళిపై ఉత్కంఠ
- బీజేడీ, బీజేపీ మధ్య ద్విముఖ పోటీ
- పీఎం మోదీ, సీఎం నవీన్ ప్రభావంపై ఆసక్తికర చర్చ

భువనేశ్వర్: రాష్ట్రంలో తొలి దశ ఎన్నికలు పురస్కరించుకుని పోలింగ్ ప్రక్రియ విజయవంతంగా ముగిసింది. ప్రధానంగా దక్షిణ ఒడిశా పరిధిలో దళిత ప్రాబల్యం ఉన్న ప్రాంతాల్లో తొలిదశ పోలింగ్ ముగిసింది. ఇక్కడ బిజూ జనతా దళ్ తన పూర్వ వైభవం చాటుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తోంది. అయితే ఈసారి బీజేడీకి భంగపాటు తప్పదని బీజేపీ చెబుతోంది. తొలిదశలో 4 లోక్‌సభ నియోజకవర్గాలతో పాటు అనుబంధ 28 శాసనసభ స్థానాల్లో పోలింగ్ పూర్తయ్యింది. 4 పార్లమెంటరీ నియోజకవర్గాల్లో కలహండి, కొరాపుట్‌లు మాత్రం పార్టీలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. మిగిలిన 2 స్థానాలు బరంపురం, నవరంగ్‌పూర్ నుంచి బీజేడీ వరుసగా 3 సార్లు లోక్‌సభ స్థానాలను గెలుచుకుంది. తాజా ఎన్నికల్లోనూ ఈ రెండు స్థానాలను కైవసం చేసుకోవడం తథ్యమని ఆ పార్టీ ధీమా వ్యక్తం చేస్తోంది. తొలి దశలో ఓటింగ్ జరిగిన 28 అసెంబ్లీ స్థానాల్లో 2019లో బీజేడీ 20 సీట్లు (71 శాతం) గెలుచుకోగా, 4 సీట్లు (14 శాతం) బీజేపీ, 3 సీట్లు కాంగ్రెస్ (10.71 శాతం), 1 స్వతంత్ర అభ్యర్థి చేజిక్కించుకున్నారు.

కలహండి కింగ్ ఎవరో..?

కలహండి లోక్‌సభ ఒక స్వింగ్ స్థానం. 2009లో కలహండి లోక్‌సభ స్థానాన్ని కాంగ్రెస్ గెలుచుకుంది. 2014లో బీజేడీ గెలిచింది మరియు 2019లో బీజేపీ గెలిచింది. ఈసారి బీజేపీ, బీజేడీ మధ్య ప్రధాన పోరు కనిపిస్తోంది. కలహండి లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో 7 అసెంబ్లీ సెగ్మెంట్లలో, 5 సీట్లు బీజేడీ 2019లో గెలుచుకుంది. వీటిలో ధరమ్‌గఢ్, జునాగఢ్, లంజిగఢ్, నార్లా మరియు నువాపడా ఉన్నాయి. మిగిలిన 2 స్థానాలను కాంగ్రెసు, బీజేపీ చెరొకటి కైవసం చేసుకున్నాయి. ఖరియార్‌లో కాంగ్రెస్, భవానీపట్న అసెంబ్లీ స్థానాన్ని బీజేపీ గెలుచుకున్నాయి. కలహండి లోక్‌సభ స్థానం పట్ల ఉత్కంఠ బిగుసుకుని ఉంది. ఈసారి బీజేపీ, బీజేడీ హోరాహోరీగా తలపడ్డాయి. ఈ స్థానం చేజిక్కించుకోవడం ఉభయ పక్షాలు ప్రతిష్ఠాత్మంగా పరిగణిస్తున్నాయి.

ఆసక్తికరంగా కొరాపుట్

కొరాపుట్ లోక్‌సభ స్థానం గతంలో కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉండేది. 1972 నుంచి 1998 వరకు గిరిధర్ గొమాంగో వరుసగా 8 సార్లు గెలిచారు. 1999లో కాంగ్రెస్ నుంచి ఆయన భార్య హేమా గొమాంగో గెలిపొందగా, 2004లో గిరిధర్ గొమాంగో మళ్లీ గెలిపొందారు. 2009 మరియు 2014లో బీజేడీ వరుసగా 2 సార్లు ఈ స్థానాన్ని గెలుచుకుంది. అయితే 2019లో కాంగ్రెస్‌కు చెందిన సప్తగిరి ఉలాకా విజయం సాధించారు. ఈసారి కాంగ్రెస్, బీజేడీ మధ్యే ప్రధాన పోరు నెలకొంది. 2019లో కొరాపుట్ లోక్‌సభ స్థానంలోని 7 అసెంబ్లీ సెగ్మెంట్లలో 2019లో బీజేడీ 5, కాంగ్రెస్ 1 మరియు 1 స్వతంత్ర అభ్యర్థి గెలిచారు. ఇక్కడ బీజేపీ ఖాతా తెరవలేక పోయింది. బిసంకటక్, గుణుపురం, కొరాపుట్, లక్ష్మీపూర్, పొట్టంగి అసెంబ్లీ స్థానాలను బీజేడీ గెలుచుకుంది. జయపురం నుంచి కాంగ్రెస్, రాయగడ నుంచి స్వతంత్రులు గెలిపొందారు.

మళ్లీ బీజేడీ కైవసమేనా..?

సోమవారం ముగిసిన తొలి విడత పోలింగ్‌లో మిగతా 2 లోక్‌సభ స్థానాలు బరంపురం, నవరంగపూర్ స్థానాల్లో బిజూ జనతా దళ్ 2009 నుంచి వరుసగా 3 సార్లు విజేతగా నిలిచింది. ఈసారి ఈ రెండు ప్రాంతాల్లో బీజేపీ కోసం భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హోరాహోరీగా ప్రచారం చేశారు. అంతే కాకుండా నవీన్ పట్నాయక్ నేతృత్వంలో బీజేడీ తీరుని తీవ్రంగా దుయ్యబట్టారు. ఈ ప్రభావం తాజా ఎన్నికలపై ఎంతవరకు ఉంటుందో వేచి చూడాల్సిన పరిస్థితులు నెలకొని ఉన్నాయి. బీజేపీ వర్గీయులు మాత్రం ఈసారి ఈ 2 స్థానాలు బీజేడీ చేతి నుంచి తమకు దక్కుతాయని గట్టి ధీమా వ్యక్తం చేస్తున్నారు. అలాగే బీజేడీ కూడా తమ పట్టుని సడలించే సత్తా ఏ వర్గానికి లేదని నమ్మకంగా ఉంది.

తగ్గిన పోలింగ్ శాతం

2019లో జరిగిన గత ఎన్నికల పోలింగ్ కంటే సోమవారం ముగిసిన తొలి దశ పోలింగ్‌లో కీలకమైన లోక్‌సభ స్థానాల్లో పోలింగ్ శాతం తగ్గింది. బరంపురం పార్లమెంటరీ నియోజకవర్గంలో గతసారి 65.9 శాతం పోలింగ్ నమోదు కాగా, ఈసారి 63.34 శాతానికి పరిమితం అయింది. కలహండి లోక్‌స్థానం పరిధిలో పోలింగ్ పరిస్థితి ఇలానే దిగజారినట్లు ప్రాథమిక గణాంకాలు సూచిస్తున్నాయి. ఈ నియోజకవర్గంలో గత ఎన్నికల్లో 76.41 శాతం మంది ఓటు వేయగా, ఈసారి పోలింగు 75.71 శాతానికి పరిమితమైన తగ్గుముఖం పట్టింది. మిగిలిన 2 పార్లమెంటరీ నియోజకవర్గాలు కొరాపుట్ మరియు నవరంగపూర్ ప్రాంతాల్లో గతం కంటే పోలింగు స్వల్పంగా పుంజుకుంది. 2019 ఎన్నికల్లో కొరాపుట్ లోక్‌సభ స్థానంలో పోలింగ్ 75.34 శాతానికి పరిమితం కాగా, ఈసారి 76.98 శాతానికి పుంజుకుంది. నవరంగపూర్ పార్లమెంటరీ నియోజకవర్గంలో కూడ ఈసారి పోలింగ్ ఆశాజనకంగా సాగింది. ఈ ప్రాంతంలో గత సారి పోలింగు 79.52 శాతం రికార్డు కాగా, ఈసారి 80.22 శాతానికి పుంజుకుంది. ఈ 4 లోక్ సభ స్థానాల అనుబంధ 28 అసెంబ్లీ సెగ్మెంట్ల తొలి దశ ఎన్నికల్లో సమగ్ర పోలింగ్ పుంజుకుంది. 2019 సార్వత్రిక ఎన్నికల్లో బరంపురం, కలహండి, నవరంగపూర్, కొరాపుట్ పార్లమెంటరీ నియోజకవర్గాల్లో 28 శాసన సభ స్థానాల్లో సమగ్ర పోలింగ్ 73.29 శాతానికి పరిమితం కాగా, ఈసారి 73.97 శాతంగా రికార్డు అయింది.

న్యూస్‌రీల్

జలపాతంలో పడి ఇద్దరు మృతి



జలపాతం వద్ద యువకుల మృతదేహాలు

కొరాపుట్: జిల్లాలోని పొట్టంగి సమితి సమీపంలో గాలిగబ్దర్ జలపాతంలో జారిపడి ఇద్దరు యువకులు మృతి చెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. పట్టణంలోని పీహెచ్‌డీ కాలనీకి చెందిన ఆశిష్ కుమార్ పండా (24), జన్నిగుడకి చెందిన నిత్యేష్ కుమార్ దాస్ (24)లు స్నానానికి జలపాతం వద్దకి వెళ్లారు. అక్కడ వారు జలపాతంలో జారిపడి మృతి చెందారు. అగ్నిమాపక బృందాలు, పోలీసులు అక్కడికి చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అయితే ఈ ప్రాంతంలో తరుచూ ఇటువంటి ఘటనలు చోటుచేసుకోవడంపై స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జూన్ 17 నుంచి ఉత్సవాలు



బురదల పోలమ్మ అమ్మవారు

రాయగడ: స్థానిక ప్రజల ఆరాధ్య దైవంగా పూజలందుకుంటూ బైరవీధిలో కొలువైన బురదల పోలమ్మ అమ్మవారి వార్షిక ఉత్సవాలు జూన్ 17 నుంచి ప్రారంభమవుతాయి. తొమ్మిది రోజుల పాటుగా నిర్వహించనున్న ఈ ఉత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహించేందుకు ప్రత్యేక కమిటీ ఏర్పాటయ్యింది. కమిటీ అధ్యక్షుడిగా పతివాడ శ్రీనివాస్‌రావు, వర్కింగ్ ప్రెసిడెంటుగా కింతలి శ్రీనివాస్‌రావు, ఉపాధ్యక్షుడిగా ఎద్దు శ్రీహరి, కార్యదర్శిగా బార్జి శేషగిరి, కోశాధికారిగా బి.సర్వేశ్వరరావులు నియమితులయ్యారు. ప్రతీ ఏడాదిలా ఈసారి కూడా అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా పూజా కార్యక్రమాలను నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తామని కమిటీ అధ్యక్షుడు పతివాడ శ్రీనివాస్‌రావు తెలియజేశారు.

సురక్షితంగా చేరిన పోలింగ్ సిబ్బంది



ఇంద్రావతి రిజర్వాయర్ తీరం నుంచి గమ్యం చేరిన పోలింగ్ సిబ్బంది

భువనేశ్వర్: రాష్ట్రంలో తొలి విడత పోలింగ్ సోమవారం శాంతియుతంగా ముగిసిన విషయం తెలిసిందే. ఈ ప్రక్రియ నిర్వహణ కోసం భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు కొండకోన ప్రాంతాల్లో సైతం పోలింగ్ సౌకర్యాలు కల్పించారు. ఆయా ప్రాంతాలకు అనుబంధ యంత్రాంగం లాంచి, హెలికాప్టర్ వంటి వాహనాల్లో చేరి పోలింగు ప్రక్రియ విజయవంతం చేశారు. వీరంతా సురక్షితంగా గమ్యం చేరినట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల కార్యాలయం వర్గాలు తెలిపాయి.

స్ట్రాంగ్ రూమ్‌లకు ఈవీఎంలు



స్ట్రాంగ్ రూమ్ వద్ద బందోబస్తు

బరంపురం: గంజాం జిల్లాలో తొలి విడత పోలింగ్ అనంతరం ఈవీఎంలను పటిష్ట భద్రత మధ్య స్థానిక ఐఐటీ ఇన్‌స్టిట్యూట్‌లోని స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించారు. జూన్ 4వ తేదీన ఓట్ల లెక్కింపు చేపట్టనుండడంతో అప్పటివరకు భారీ భద్రత ఏర్పాటు చేశారు.



చందన యాత్రలో సుదర్శనుడు

శ్రీజగన్నాథుని యాత్రలో అడుగడుగున పలు ఆసక్తికరమైన సన్నివేశాలు తారసపడుతుంటాయి. చందన యాత్ర పురస్కరించుకుని చక్రరాజు సుదర్శనుని స్వర్ణ ప్రతిమ శ్రీజగన్నాథుని ప్రతినిధిగా ముందడుగు వేస్తుంది. బొడొ దండొ గుండా నరేంద్ర సరోవరం వరకు సాగే ఊరేగింపులో రామకృష్ణుని పల్లకి ఎదురుగా చక్రరాజు సువర్ణ సుదర్శనుడు ముందడుగు వేయడం ఆచారం. సరోవరంలో నావికా విహారం ఆద్యంతం సేవకుడు సువర్ణ సుదర్శనుని చేత పట్టుకుని నావపై నిలబడే ఉంటాడు.

- భువనేశ్వర్

నిరంతర సాధన అవసరం



కదాంబిని పత్రిక నెలవారి సంచికను విడుదల చేస్తున్న దృశ్యం

రాయగడ: సమాజానికి మంచి కథనాలు అందించాలంటే ప్రతీ రచయిత, కవి నిరంతరం సాధన చేయాల్సిన అవసరం ఉంటుందని కదాంబిని ఒడియా మాస పత్రిక సంపాదకురాలు డాక్టర్ ఇతి సామంత అభిప్రాయపడ్డారు. పత్రిక ఏర్పాటై 25 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో స్థానిక సాయి ఇంటర్నేషనల్‌లో సోమవారం సాయంత్రం వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతీ రచయిత, కవి తన కలానికి పదును పెడుతూ ఉండాలని సూచించారు. మంచి రచనలు సమాజ శ్రేయస్సుకు దోహదపడతాయని పేర్కొన్నారు. మెరుగైన సమాజాన్ని ఆవిష్కరించాలంటే అందుకు ప్రతీ ఒక్కరి బాధ్యతగా గుర్తించాలన్నారు. కదాంబిని మాస పత్రిక ఏర్పాటు సమయంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కోవాల్సి వచ్చిందన్నారు. క్రమేపీ పాఠకుల ఆదరాభిమానాలు పెరగడంతో పత్రిక రంగంలో తనదైన స్థాయిని సంపాదించుకోగలిగిందని తెలియజేశారు. కొత్త రచనలు, కొత్త ఆలోచనలతో ఉన్న ప్రతీ అంశం పాఠకునికి చదివింపజేస్తుందన్నారు. తమ రచన, కవితల్లో సమాజానికి ఒక మంచి సందేశాత్మకంగా ఉండేలా తగు జాగ్రత్తలు పాటించాలని కోరారు. కార్యక్రమంలో ప్రముఖ విద్యావేత్త డాక్టర్ డీకే మహంతి, ఒడిశా సాహిత్య అకాడమీ సభ్యులు సుశాంత్ నాయక్, ప్రముఖ కళాకారిణి, గాయని, నటి అనురాధ పాణిగ్రాహి తదితరులు పాల్గొన్నారు. సీనియర్ జర్నలిస్ట్, కదాంబిని పత్రిక రచయిత అమూల్యరత్న సాహు అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది.

పరిచయం పెంచుకొని.. పాపను విడిచి



శిశు సంరక్షణ కేంద్రంలో ఉన్న పాప

రాయగడ: రైలులో ప్రయాణించిన ఒక మహిళ పక్కనే తనతో ప్రయాణిస్తున్న ఒక ప్రయాణికురాలితో మాటామాటా కలిపి పరిచయం పెంచుకొని, చివరకు గమ్యం స్థానం చేరేసరికి పాపను విడిచి పరారైంది. మునిగుడలో చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి వివరాల్లోకి వెళ్తే.. జిల్లాలోని చంద్రపూర్ ప్రాంతానికి చెందిన అనంత్ క్రొటింగ్ అనే మహిళ మంగవారం ఏదో పనిమీద రాయగడ వచ్చారు. పనులు ముగించుకున్న అనంతరం తిరిగి తన స్వగ్రామానికి వెళ్లేందుకు రాయగడలో ట్రైన్ ఎక్కింది. జనరల్ కంపార్ట్‌మెంట్‌లో కూర్చుంది. పక్కనే మరో మహిళ చంటి పాపతో ప్రయాణం చేస్తోంది. కొద్దిదూరం ప్రయాణం చేసిన తర్వాత వారి మధ్య మాటామాటా కలిసి పరిచయం పెరిగింది. అనంతరం మునిగడు రైల్వేస్టేషన్‌లో ఇద్దరు మహిళలు దిగారు. ఇంతలో పాపను కాసేపు ఎత్తుకోండి టాయ్‌లెట్స్‌కు వెళ్లి వస్తానని చెప్పి పాపను క్రొటింగ్ అనే మహిళకు అప్పగించింది. పాపను ఎత్తుకున్న క్రొటింగ్ గంటలు తరబడినా ఎదురుచూసిన వాళ్ల అమ్మ రాలేదు. దీంతో కావాలనే పాపను విడిచిపెట్టాలని నిర్ణయించకున్నారని అర్థం చేసుకొని మునిగుడ పోలీసుస్టేషన్‌ను ఆశ్రయించింది. వెంటనే ఐఐసీ సౌదామిని బెహర వెంటనే స్పందించి జిల్లా శిశుసంరక్షణ కేంద్రం వారికి సమాచారం అందించారు. ప్రస్తుతం పాప శిశు సంరక్షణ కేంద్రంలో సురక్షితంగా ఉంది. అయితే పాపను ఎత్తుకుని ప్రయాణించిన మహిళ ఎవరు, ఎక్కడి నుంచి ప్రయాణించింది, పాపను విడిచిపెట్టి వెళ్లడంపై సమగ్ర దర్యాప్తు చేపడతామని పోలీసులు పేర్కొన్నారు. రైల్వేస్టేషన్‌లో ఉన్న సీసీ కెమేరాల ఆధారంగా ఆ మహిళను గుర్తించి పట్టుకునే ప్రయత్నం చేస్తామన్నారు.

రోడ్డు ప్రమాదంలో ప్రిసైడింగ్ అధికారి మృతి





ఇంద్రజిత్ మృతదేహం వద్ద రోధిస్తున్న కుటుంబ సభ్యులు

మల్కన్‌గిరి: జిల్లాలోని మత్తిలి సమితి తప్పగూడ గ్రామం వద్ద మంగళవారం ఉదయం ఒక ప్రైవేటు బస్సు ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో పోలింగ్ ప్రిసైడింగ్ అధికారి ఇంద్రజిత్ కిర్సనీ మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. ఇంద్రజిత్ కిర్సనీ అనే వ్యక్తి చిత్రకొండ నియోజకవర్గం 122వ పోలింగ్ కేంద్రంలో ప్రిసైడింగ్ అధికారిగా విధులు ముగించుకొని సోమవారం రాత్రి ఈవీఎం మెషిన్లు జిల్లా కేంద్రంలో అప్పగించారు. అనంతరం మల్కన్‌గిరిలో రాత్రి ఉండిపోయి మంగళవారం ఉదయం సొంత ఊరు అయినటువంటి ఖొయిర్‌పూట్ సమితి కదంగూడ పంచాయతీ ఖురిగూడ గ్రామానికి ద్విచక్ర వాహనంపై బయల్దేరాడు. అయితే మత్తిలి సమితి వద్ద ఒక ప్రైవేటు బస్సు వచ్చి ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే తోటి ఉపాధ్యాయులు అంబులెన్స్‌తో మత్తిలి ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అయితే అప్పటికే అతను మరణించినట్లు వైద్యులు తెలియజేశారు. విషయం తెలిసిన వెంటనే చిత్రకొండ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి డొంబురు శీసా, ఇతర గ్రామస్తులు మత్తిలి ఆరోగ్య కేంద్రానికి చేరుకొని సంతాపం తెలిపారు. ఇంద్రజిత్ మల్కన్‌గిరి సమితి సీక్‌పల్లి ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్నాడు. మత్తిలి పోలీసులు కేసు నమోద్‌చేసి బస్సు డ్రైవర్‌ను అరెస్టు చేశారు. మృతదేహన్ని పోస్టుమార్టం అనంతరం మంగళవారం సాయంత్రం కుటుంబ సభ్యులకు అప్పగించారు.



ప్రమాద స్థలంలో బైక్

బరంపురంలో ఉద్రిక్తత



బీజేపీ అభ్యర్థి పాణిగ్రాహిని పరామర్శిస్తున్న పార్టీ శ్రేణులు



గుసానినువాగం పోలీసుస్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న మద్దతుదారులు



పోలీసుస్టేషన్‌లో పింకు దాస్ సతీమణి సరితా దాస్ తదితరులు



శివశంకర్ దాస్‌ను కోర్టుకి తరలిస్తున్న పోలీసులు

బరంపురం: నగరంలో జరిగిన ఎన్నికల్లో భాగంగా ఉద్రిక్త పరిస్థితులు చోటుకున్నాయి. బరంపురం లోక్‌సభ బీజేపీ అభ్యర్థి డా.ప్రదీప్ పాణిగ్రాహిపై, స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న మాజీ మేయర్ శివశంకర్ దాస్ అలియాస్ పింకు దాస్ దాడిచేసి గాయపరిచాడు. దీంతో ప్రదీప్ పాణిగ్రాహి గాయలతో స్థానిక ఎంకేసీజీ మెడికల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. హింసాత్మక ఘటనలపై విషయం తెలుసుకున్న బరంపురం ఎస్పీ సార్థక్ సడంగి ఆదేశంతో గుసానినువాగం పోలీసుస్టేషన్ అధికారులు శివశంకర్ దాస్‌ను అరెస్టు చేశారు. దీంతో ఆయన మద్దతుదారులు ఆందోళన దిగారు. ఆయనను బరంపురం జిల్లా కోర్టుకి తరలించి సబ్ కోర్టులో హాజరుపరిచారు. బెయిల్ దొర్కకపోవడంతో బరంపురం సర్కిల్ జైలుకి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి



రహదారిపై ఆందోళన చేస్తున్న ప్రజలు



తాపాన్ (ఫైల్)

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలో మంగళవారం సాయంత్రం ట్రాక్టర్, బైక్ ఢీకొని ఒకరు మృతి చెందారు. మల్కన్‌గిరికి చెందిన తాపాన్ మండాల్ (55) అనే వ్యక్తి కలిమెల సమితి ఎంవీ 18 స్వగ్రామానికి వెళ్తున్న సమయంలో ఘటన జరిగింది. ఆస్పత్రి సమీపంలో ఒక ట్రాక్టర్‌ను మరో ట్రాక్టర్ తాడుకట్టి లాగుతున్న సమయంలో అటువైపు బైక్‌పై వస్తున్న తాపాన్ ఢీకొని కింద పడిపోయారు. వెంటనే గాయాలుపాలైన అతడిని ఆస్పత్రికి తరలించినా, అప్పటికే మృతి చెందాడు. ఈ విషయం తెలిసిన మల్కన్‌గిరి ఐఐసీ రీగాన్ కీండో తన సిబ్బందితో వెళ్లి కేసు నమోద్ చేసి, కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగిస్తామని తెలిపారు. ఓనర్ మణిశంకర్ తాపాన్ కుటుంబ సభ్యులకు నష్ట పరిహారం అందజేయాలని స్థానికులు ఆందోళన చేపట్టారు. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.



రోడ్డుపై నిలిచిన వాహనాలు

క్లుప్తంగా

రాయగడలో 72.91 శాతం పోలింగ్



రాయగడ: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా జిల్లాలోని రాయగడ, గుణుపూర్, బిసంకటక్ శాసనసభ నియోజకవర్గాల్లో సోమవారం జరిగిన పోలింగ్ వివరాలను జిల్లా ఎన్నికల అధికారి మనోజ్ సత్యవాన్ మహాజన్ మంగళవారం ప్రకటించారు. రాయగడలో 72.91 శాతం, గుణుపూర్‌లో 72.53 శాతం, బిసంకటక్ నియోజకవర్గంలో 77.93 శాతం పోలింగ్ జరిగినట్లు వెల్లడించారు. జిల్లాలో అత్యధిక శాతం పోలింగ్ జరిగేలా చర్యలు చేపట్టినప్పటికీ ఫలితం లేకపోయింది. ఈసారి సార్వత్రిక ఎన్నికల్లో కనీసం 80 శాతంకు పైబడి పోలింగ్ జరిగేలా ముందుగానే జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టినా 80 శాతంలోపే పోలింగ్ జరిగింది. కొన్ని గ్రామాల్లో నాయకులపై మండిపడిన ఓటర్లు ఎన్నికల్లో పాల్గొనకుండా బహిష్కరించి తమ నిరసనను తెలియజేయడం వంటి పరిణామాల కారణంగా ఈ పరిస్థితి ఎదురైనట్లు సమాచారం.

ఆదుకున్న స్నేహితులు



ఈశ్వరరావు కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న స్నేహితులు

జలుమూరు: మండల పరిధి కరకవలసకు చెందిన కరికోల ఈశ్వరరావు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. ఆయనతో పాటు స్థానిక జెడ్పీ హైస్కూల్లో చదువుకున్న వారంతా మృతుని కుటుంబాన్ని ఆదుకున్నారు. ఈ మేరకు అతని భార్య లక్ష్మిని పరామర్శించి రూ.50 వేలు ఆర్థిక సాయం అందించారు. స్నేహితుల ఉదారతపై పలువురు అభినందించారు.

బైక్ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

టెక్కలి రూరల్: స్థానిక ఒలేసాగరం సమీపంలో ద్విచక్రవాహనం ఢీకొని పల్లి శ్రీనివాస్ అనే వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఈ మేరకు స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. టెక్కలికి చెందిన శ్రీనివాస్ అతని స్నేహితుడు వెంకటేష్‌తో కలసి ఒలేసాగరం గ్రామ సమీపంలో రోడ్డు పక్కగా మాట్లాడుతూ ఉండగా టెక్కలి నుంచి సీతాపురం వైపు ద్విచక్రవాహనంపై వెళ్తున్న యువకుడు ఒక్కసారిగా ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో వెంకటేష్‌కు స్వల్పగాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తిని టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై టెక్కలి పోలీసులు మంగళవారం వివరాలు సేకరించారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం



విరాళాన్ని అందజేస్తున్న దృశ్యం

గార: శ్రీకూర్మనాథాలయంలో నిత్యం జరిగే అన్నదాన పథకానికి శ్రీకూర్మం గ్రామానికి చెందిన చేబోలు రాజేశ్వరరావు రూ.లక్షా నూట పదహార్లు విరాళం అందజేశారు. మంగళవారం ఈ మేరకు ఈఓ జి.గురునాథంను కలిసి చెక్ అందించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు చామర్తి సీతారామనృసింహాచార్యులు, నర్సుబాబు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు



శాంతామణి అమ్మవారు

నరసన్నపేట: వైశాఖ మాసం మొదటి మంగళవారం సందర్భంగా మండల కేంద్రం నరసన్నపేటలో అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్థానిక పైడితల్లి, శాంతామణి, నూకాలమ్మ తల్లి అసిరమ్మతల్లి ఆలయాల్లో అమ్మవారికి మహిళలు ముర్రాటు సమర్పించి మామిడి పండ్లతో మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయాల వద్ద రద్దీ నెలకొంది. ఉదయం నుంచి 10 గంటల వరకు ఈ రద్దీ కొనసాగింది.

ఛాలెంజ్ ఓట్‌పై సీఈఓ స్పందన

- సోషల్ మీడియా పుకార్లపై జాగ్రత్త

భువనేశ్వర్: ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల హడావుడిలో సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లలో వైరల్ అయిన ఛాలెంజ్ ఓట్ ప్రజల్లో గందరగోళం సృష్టిస్తోంది. ఈ గందరగోళ పరిస్థితిపై స్పందించిన ఎన్నికల అధికారులు అలాంటి వ్యవస్థ లేదని స్పష్టం చేశారు. ఒడియాలో సందేశం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో, ఎన్నికలకు సంబంధించిన సమాచారంపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ నికుంజ బిహారీ ధొలా సూచించారు. ఓటరు పోలింగ్ బూత్‌కు చేరుకుని, ఓటరు జాబితాలో తన పేరు లేకుంటే, అతను లేదా ఆమె తన స్వంత ఆధార్ కార్డు లేదా ఓటర్ ఐడీని చూపించి, సెక్షన్ 49ఎ కింద 'ఛాలెంజ్ ఓటు' అడగాలని, ఓటు హక్కును వినియోగించుకోవాలని సోషల్ మీడియా సందేశం పేర్కొంది. అయితే ఈ సమాచారం తప్పుదోవ పట్టించేలా ఉందని, ఎన్నికలకు సంబంధించి అలాంటి నిబంధన ఏదీ లేదని సీఈవో స్పష్టం చేశారు. టెండర్ ఓటుకు సంబంధించి తప్పుడు సమాచారం వ్యాప్తి చెందడంపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. సాధారణంగా ఒక వ్యక్తి తన విలువైన ఓటు వేరొకరు వేసినట్లు గుర్తించినప్పుడు అరుదైన సందర్భాల్లో అనుమతించబడుతుంది. ఏదైనా ఎన్నికల సంబంధిత సందేహాల నివృతి కోసం ఓటర్లు తమ అధికార పరిధిలోని బూత్ స్థాయి అధికారులను (బీఎల్‌వో) సంప్రదించాలని సీఈఓ కార్యాలయం ఎక్స్ హ్యాండిల్ సోషల్ మీడియా పోస్ట్‌లో పేర్కొంది. ఇలాంటి నకిలీ వైరల్ సందేశాలపై ప్రజలు జాగ్రత్తగా ఉండాలని పోల్ అధికారులు, సైబర్ పోలీసులు ప్రజలను కోరారు. సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలు తప్పు దారిలో ప్రభావితం కాకూడదని హితవు పలికారు.



సోషల్ మీడియా మాధ్యమాల్లో గందరగోళం సృష్టించిన పోస్టు

వేసవి సెలవులకు వచ్చి..

- పారాపురం రిజర్వాయర్‌లో మునిగి బాలుడు మృతి
- వేసవి సెలవులకు వచ్చి మృతి చెందిన వైనం

కొత్తూరు: కొత్తూరు మండలం పారాపురం రిజర్వాయర్‌లో ప్రమాదవశాత్తు జారిపడి ఓ విద్యార్థి మృతి చెందాడు. బూర్జ మండలం బూర్జ గ్రామానికి చెందిన శ్రీరాంవలస విజయ, శ్రీహరిలకు ముగ్గురు పిల్లలు. విజయ కన్నవారిల్లు కొత్తూరు. వేసవి సెలవుల కోసం వారం రోజుల కిందట వీరు వచ్చారు. మంగళవారం సాయంత్రం హవీష్(14) తోటి పిల్లలతో కలిసి రిజర్వాయర్‌లో స్నానం చేద్దామని వెళ్లాడు. రిజర్వాయర్‌లోకి దిగుతుండగా ప్రమాదవశాత్తు జారిపడి నీటిలో మునిగిపోయాడు. హవీష్ మునిగిపోవడంతో తోటి పిల్లలు సమీపంలో క్రికెట్ ఆడుతున్న యువకులకు చెప్పారు. వెంటనే వారు రిజర్వాయర్‌లోకి దిగి అడుగున ఉన్న హవీష్‌ను బయటకు తీశారు. వెంటనే అతడిని కొత్తూరు సీహెచ్‌సీకి తీసుకువెళ్లారు. అప్పటికే హవీష్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడు హవీష్ శ్రీకాకుళంలో ఓ ప్రైవేట్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నారు. మృతుడి తల్లి విజయ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఏంఏ అహ్మద్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పాతపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. బాలుడి మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. తల్లిని ఓదార్చడం ఎవరి తరం కాలేదు.



శ్రీరాంవలస హవీష్ మృతదేహం (ఇన్‌సెట్లో) శ్రీరాంవలస హవీష్

పాముకాటుతో యువకుడు మృతి



శివానంద్(ఫైల్)

నందిగాం: చేతికి అందివచ్చిన కుమారుడు పాము కాటుకు బలైపోయాడు. మండలంలోని పెద్దలవునిపల్లి గ్రామానికి చెందిన లిఖినాన శివానంద్(21)అనే యువకుడు మృతి చెందాడు. ఈ మేరకు స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. మృతుడు శివానంద్ తన ఇంట్లో పడు కుని ఉండగా ఏదో కరిచినట్లు అయ్యింది. కానీ దాన్ని పట్టించుకోకుండా నిద్రపోయాడు. ఉదయం లేచే సరికి సుస్తీగా ఉండడంతో టెక్కలి జిల్లా ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ వైద్యం పొందుతూ మృతి చెందాడు. మృతుడికి తల్లి పార్వతి, అన్నయ్య ఉన్నారు. మృతుడు డిగ్రీ పూర్తి చేసి ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నాడు. పాముకాటుతో యువకుడు మృతిచెందిన విషయం తెలియడంతో గ్రామంలో విషాద చాయలు అలుముకున్నాయి.

నిత్య స్వరార్చన



భజనా కార్యక్రమాల్లో కీబోర్డు ప్లే చేస్తున్న సోమేశ్వరరావు

- సంగీతంలో రాణిస్తూ.. స్థానిక కళాకారులను ప్రోత్సహిస్తున్న సోమేశ్వరరావు
- భజన పాటలకు సంగీతం కూర్పు
- తన ఆదాయాన్ని కళాకారుల సంక్షేమానికే ఖర్చుచేస్తున్న వైనం
- శివస్వరాభిషేకం ఆల్బమ్ రూపకల్పన

కంచిలి: ఆయన నిరుపేద కుటుంబంలో పుట్టారు. అయినా సంగీతంపై ఉన్న ఆసక్తితో స్వరాలు నేర్చుకున్నారు. భజన పాటలకు హార్మోనియం వాయిద్యంతో సంగీతం అందించడం ద్వారా రంగ ప్రవేశం చేసి, నేడు ఉద్దానం ప్రాంతంలో ఎంతో మంది కళాకారులను తీర్చిదిద్దుతున్నారు. మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా అప్‌డేట్ ఔతూ, తనకున్న ఆర్థిక స్థోమత ద్వారా ఈ ప్రాంతంలో సంగీతం అభివృద్ధి చెందడానికి, కళాకారులను ప్రోత్సహించడం కోసం నిరంతరం అవిశ్రాంతంగా శ్రమిస్తున్నారు. ఆయనే కంచిలి మండలం జాడుపూడి గ్రామానికి చెందిన పిలక సోమేశ్వరరావు. ఈయన నాలుగో తరగతి చదువుతున్నప్పుడే తండ్రి మృతి చెందగా, తల్లి కూ డా ఇంటర్మీడియెట్ చదువుతున్న ప్రాయంలో మృతి చెందారు. దీంతో అప్పటి నుంచి కుటుంబ బాధ్యత ఒకవైపు మోస్తూ.. మరోవైపు తనకు సంగీతం మీద ఉన్న ఆసక్తిని చంపుకోకుండా అంతటి కష్ట పరిస్థితుల్లో కూడా అక్కడ ఇక్కడ పనిచేసుకొంటూ సంగీతం నేర్చుకున్నారు. గ్రామానికి చెందిన శివాల యం అర్చకుడు మోహన్‌రాశో వద్ద శిష్యరికం చేసి హార్మోనియం మొదట నేర్చుకున్నారు. అక్కడి నుంచి భజన పాటలకు మాత్రమే సంగీత కల్పనలో సహకరిస్తుండేవారు. ఇలా మొదలైన సోమేశ్వరరావు ప్రస్థానం.. తర్వాత కాలంలో కళామతల్లి ఆశీస్సుల తో దినదిన ప్రవర్ధమానమైంది. తనకు వచ్చిన విద్య ను పలువురిని నేర్పించడం మొదలుపెట్టారు. ఇచ్చా పురం నుంచి వజ్రపుకొత్తూరు వరకు గల 7 మండలాల పరిధిలో ఉన్న సంగీత కళాకారులందరికీ ఒకేతాటిపైన నడిపించే విధంగా ఒకచోటకు చేర్చడంతో, ఈయనను తమ యూనియన్ అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. భజన కార్యక్రమాలకు వెళ్లడం ద్వారా మిగ తా ఆ బృందానికి ఇచ్చే పారితోషికంలో తన వాటాగా వచ్చే మొత్తాన్ని తన సొంతానికి ఖర్చుపెట్టకుండా ఒక నిధిని ఏర్పాటు చేస్తున్నారు. ఆ సొమ్ము తో పేద కళాకారులెవరికైనా ఆర్థిక అవసరాలు ఏర్పడినా, కళాకారులను అప్పుడప్పుడు సమావేశపరిచి, ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టడం వంటివి చేపడుతున్నారు.



కీబోర్డు ప్లే చేస్తున్న పిలక సోమేశ్వరరావు

పుణ్యక్షేత్రాల్లో సైతం..

తిరుమల తిరుపతి దేవస్థానంలోను, మహారాష్ట్రలోను, విశాఖపట్నం జిల్లా తదితర ప్రాంతాల్లో తన బృందంతో కలిపి భక్తిపాటలకు సంగీతం అందించారు. ఒకసారి వారణాసిలో కూడా అనుకోకుండా అవకాశం రావడంతో కీబోర్డు ప్లే చేసినట్లు తెలిపారు.

శివుని పాటలతో ఆల్బమ్ రూపకల్పన..

తనకు ఇష్టదైవమైన శివుని ఆరాధించే 16 పాటలను రాసి, సంగీతం అందించి, కీబోర్డు ప్లే చేస్తూ రూపొందించారు. ఈ సీడీలను విడుదల చేశారు. ఈ పాటలు ఉద్దానం ప్రాంతంలో వివిధ ప్రాంతాల్లో వింటున్నారు. సంగీతంలో తనకున్న అనుభవంతో సమాజానికి సందేశాన్నిచ్చే వివిధ అంశాలను ఎంపిక చేసుకొని, స్థానిక కళాకారులను భాగస్వామ్యం చేస్తూ 38 వీడియో పాటలను చిత్రీకరించారు. వీటిని సోమేష్‌చంద్ర స్కిల్స్ పేరుతో యూట్యూబ్ చానల్ ఓపెన్ చేసి, అప్‌లోడ్ చేశారు. కళామ్మతల్లిపై పెట్టుకున్న మక్కువ, భక్తిభావమే తనకు చిన్నప్పటి నుంచి అన్నింటినీ సమకూరుస్తోందని నమ్ముతున్నానని సోమేశ్వరరావు సాక్షితో చెప్పారు.

ప్రారంభమైన సింధు పోలమ్మ మహోత్సవాలు



సింధుపోలమ్మ అమ్మవారి విగ్రహం



ఆకట్టుకుంటున్న విద్యుద్దీపాలంకరణ

కంచిలి: మండలంలోని కేసరపడ గ్రామదేవత సింధు పోలమ్మ గ్రామదేవత నవరాత్రి మహోత్సవాలు ఈ నెల 13వ తేదీ రాత్రి నుంచి వైభవంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారిని మేళతాళాలు, వేషధారణలతో ఊరేగిస్తూ తీసుకొచ్చారు. ఉత్సవాలు ఈ నెల 21వ తేదీ వరకు నిర్వహించనున్నారు. తొమ్మిది రోజులపాటు అమ్మవారిని గ్రామ పుర వీధుల్లో మేళతాళాలతో ఊరేగింపు చేపడతారు. ఉత్సవాల సందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను కమిటీ సభ్యులు ఏర్పాటు చేశారు. గ్రామం అంతటా కళ్లు మిరుమిట్లుగొలిపే విధంగా విద్యుద్దీపాలంకరణ చేపట్టారు. ఉత్సవాలను విజయవంతం చేయాలని కమిటీ సభ్యులు కోరారు.

మెంటాడలో కొట్లాట



మెంటాడలోని సంఘటన స్థలంలో పోలీసులు

రణస్థలం: మెంటాడ గ్రామంలో రెండు గ్రామాల యువకుల మధ్య మద్యం మత్తులో జరిగిన గొడవ తీవ్ర ఉద్రిక్తతలకు దారి తీసింది. జేఆర్ పురం పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. మండలంలో మెంటాడ గ్రామంలో మంగళవారం మధ్యాహ్నం 1గంట సమయంలో విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలంలోని చింతపల్లి, మండలంలోని మెంటాడ గ్రామాలకు చెందిన యువకుల మధ్య స్వల్ప వివాదం చోటు చేసుకుంది. ఈ నేపథ్యంలో ఇరువర్గాల కొట్లాటలో గాయపడిన చింతపల్లి యువకులు గ్రామంలోనికి వెళ్లి మెంటాడ గ్రామస్తులు కొట్టారని చెప్పడంతో ఆ గ్రామానికి చెందిన సుమారు 100 మంది మెంటాడ గ్రామానికి వచ్చారు. రెండు వర్గాల మధ్య కొట్లాట జరిగింది. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న జేఆర్ పురం సీఐ జి.రామచంద్రరావు సంఘటన స్థలానికి వెళ్లి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. ఈ కొట్లాటలో మెంటాడకు చెందిన సాడి రమణ, పెంటయ్య, నూకలమ్మ గాయాలు కావడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ కె.గోవిందరావు తెలిపారు.

ఏపీఆర్‌జేసీలో సత్తాచాటిన విద్యార్థులు



బుడితి యమున రగుతు భవ్యశ్రీ మహేష్ ప్రఘ్నప్రియ

కోటబొమ్మాళి: ఏపీఆర్‌జేసీ పరీక్ష ఫలితాల్లో కోటబొమ్మాళి మండలం ఊడికిలపాడు గ్రామానికి చెందిన సనపల ప్రఘ్నప్రియ 32వ ర్యాంకు సాధించింది. ప్రఘ్నప్రియ పదో తరగతి వరకూ కోటబొమ్మాళిలోని ఓ ప్రైవేటు హైస్కూల్‌లో చదివింది. తండ్రి రమేష్ ఆన్‌లైన్ కేంద్రం నడుపుతున్నాడు. తల్లి గృహిణి. ప్రఘ్నప్రియను స్థానిక ఎంఈఓ 1, 2లు ఎస్. అప్పలరాజు, ఎల్‌వీప్రతాప్ అభినందించారు.

48వ ర్యాంకు

సరుబుజ్జిలి: ఏపీఆర్‌డీసీ ఫలితాల్లో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ఇంటర్మీడియెట్ విద్యార్థి కూరాకుల మహేష్ రాష్ట్రస్థాయిలో 48వ ర్యాంకు సాధించాడు. విద్యార్థి తల్లిదండ్రులు కూలి పనులు చేసుకొని తన కుమారుడిని చదివించారు. విద్యార్థికి ర్యాంకు దక్కడంపై ప్రిన్సిపాల్ రాబిల్లి భూషణరావు, అధ్యాపకులు అభినందన తెలిపారు.

సారవకోట విద్యార్థులు

సారవకోట: ఏపీఆర్‌జేసీ పరీక్ష ఫలితాలలో మండలంలోని పలువురు విద్యార్థినులు సత్తా చాటారు. సారవకోట నవతేజ పాఠశాలకు చెందిన ముగ్గురు బాలికలు ఉత్తమ ర్యాంకులు సాధించారు. వీరిలో బుడితి యమునకు బైపీసీలో 192వ ర్యాంకు, సూరపు శ్రావణికి ఎంపీసీలో 271వ ర్యాంకు, రగుతు భవ్యశ్రీకి ఎంపీసీలో 521వ ర్యాంకులు వచ్చాయి.

ఆహా.. తాటి ముంజెలు



తాటి ముంజెల్ని కొడుతున్న యువకులు

ఇచ్ఛాపురం రూరల్: మండు వేసవిలో తాటి ముంజెలు నోరూరిస్తున్నాయి. వేసవిలో మాత్రమే దొరికే ఈ ప్రకృతి ప్రసాదం ఆరోగ్యానికి ఎంతో మంచిది. అప్పుడే చెట్టుమీద నుంచి దింపే ముంజకాయలు స్వచ్ఛమైనవి, కల్తీ లేనివి, ఆరోగ్యమైనవి. ఈ పండు శరీరానికి కలిగించే చలువ వల్ల దీన్ని 'ఐస్ యాపిల్' అని కూడా అంటారు. ఉద్దానం ప్రాంతంలోని కొబ్బరి తోటల గట్లుపై, పంట పొలాల గట్లుపై ఈ చెట్లు విరివిగా పెరుగుతాయి. లేత తాటి కాయల నుంచి అమ్మకందారులు నేర్పుగా ముంజలను వేరు చేసి వెదురు బుంగల్లో, తాటి కమ్మల్లో వేసి డజను యాభై రూపాయలు చొప్పున్న విక్రయిస్తున్నారు.



తాటి ముంజెలు

ముగ్గురు యువకులకు తీవ్ర గాయాలు



లొడగల భీమారావుకు వైద్యం అందిస్తున్న సిబ్బంది



కాలు విరిగిన కొర్రాయి అశోక్

కాశీబుగ్గ: ఆగి ఉన్న ద్విచక్రవాహనాన్ని అత్యధిక వేగంతో ఢీకొట్టడంతో ముగ్గురు యువకులకు తీవ్ర గాయాలైన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. వజ్రపుకొత్తూరు మండలం అనంతగిరి పంచాయతీ వెంకటాపురం జాతీయ రహదారిపై ప్రమాదం జరిగింది. సంతబొమ్మాళి మండలం గొదలాం గ్రామానికి చెందిన కొర్రాయి అశోక్, డొక్కరి కామరాజులు బైక్‌పై ఉండగా వెంకటాపురం జాతీయ రహదారిపై లొడగల భీమారావు, జనపాన వసంతరావు వారికి ఎదురుగా వచ్చి ఢీకొన్నారు. దీంతో అంతా రోడ్డుపై చెల్లాచెదురుగా పడిపోయారు. ప్రమాదంలో కొర్రాయి అశోక్‌కు కుడికాలు విరిగిపోగా, లొడగల భీమారావుకు, డొక్కరి కామరాజుకు తలలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు స్పందించి ప్రమాద స్థలం నుంచి హుటాహుటిన వారిని ప్రభుత్వ అంబులెన్సులో పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు. అత్యవసర వైద్యం అందించిన ఆస్పత్రి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యానికి టెక్కలి జిల్లా ఆస్పత్రికి ఇద్దరిని, శ్రీకాకుళం రిమ్స్‌కు ఇద్దరిని వేర్వేరు అంబులెన్స్‌లో తరలించారు. వజ్రపుకొత్తూరు పోలీసులు విచారణ చేపడుతున్నారు.

'ప్రతిభ'కు ప్రభుత్వ ప్రోత్సాహం

- ప్రభుత్వ బడుల్లో చదివి టాపర్లుగా నిలిచిన టెన్త్, ఇంటర్మీడియెట్ టాపర్లకు ప్రభుత్వం నజరానా
- పాఠశాల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్రస్థాయిల్లో సన్మానం
- ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏర్పాట్లు చేస్తున్న విద్యాశాఖ అధికారులు



టెన్త్‌క్లాస్ విద్యార్థులు

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రభుత్వ బడుల్లో చదివి పదో తరగతి పరీక్షల్లోను, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివి ఇంటర్మీడియెట్ పరీక్షల్లోను అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలు (స్టేట్ బ్రిలియన్స్ అవార్డ్స్) పేరిట సన్మానాలతోపాటు నగదు ప్రోత్సాహకాలు వరుసగా రెండో ఏడాది కూడా అందజేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకు అధికారులు వివరాలు సేకరణ పనిలో నిమగ్నమయ్యారు. ప్రభుత్వం అందజేస్తున్న జగనన్న ఆణిముత్యాల సన్మానాలు, నగదు పారితోషికం పాఠశాల స్థాయి, నియోజకవర్గ స్థాయి, జిల్లా స్థాయి, రాష్ట్రస్థాయి నాలుగు దశలుగా సన్మానాలు చేయనున్నారు. నియోజకవర్గ స్థాయిలతో పాటు ఆయా పాఠశాలల యాజమాన్యాల వారీగా టాపర్లకు బహుమతులు అందించనున్నారు.

మొదటి మూడు స్థానాలకు..

జిల్లా విద్యాశాల అధికారులు మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారి జాబితాలను సిద్ధం చేస్తున్నారు. వారికి బహుమతి, మెరిట్ సర్టిఫికెట్, జ్ఞాపికను అందించనున్నారు. అలాగే ప్రతిభ కనబర్చిన విద్యార్థుల తల్లిదండ్రులను ఆయా పాఠశాలల ఉపాధ్యాయులను కూడా సత్కరిస్తారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులను మరింత ప్రోత్సాహించే దిశగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఈ కార్యక్రమానికి గత ఏడాదే శ్రీకారం చుట్టారు. ఈ తరహా విధానాలు.. విద్యార్థుల్లో కొత్త ఉత్సాహాన్ని, పోటీతత్వాన్ని తీసుకొస్తాయని భావించి ఈ నిర్ణయం తీసుకున్నారు. సీఎం నిర్ణయంపై ఉపాధ్యాయ వర్గాలు, తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. గతంలో లాగానే ఈ ఏడాది కూడా అవే మొత్తాలను నజరానాగా అందజేసే యోచనలో ప్రభుత్వం ఉందని అధికారులు చెబుతున్నారు.

క్లుప్తంగా

16, 17న 'గురుకుల' మిగులు ఇంటర్మీడియట్ సీట్లకు కౌన్సెలింగ్

విజయనగరం అర్బన్: ఉమ్మడి విజయనగరం జిల్లాలోని డాక్టర్ బీఆర్అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో 2024–25 విద్యాసంవత్సరానికి ఇంటర్మీడియట్ కోర్సుల్లో మిగులు సీట్ల భర్తీ కోసం ఈ నెల 16, 17వ తేదీన కౌన్సెలింగ్ చేపడుతున్నామని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ జిల్లా సమన్వయకర్త టి.పద్మజ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రవేశ పరీక్షలోని ప్రతిభావంతులతో మొదటి లిస్ట్ ఇటీవల భర్తీ చేశామని తెలిపారు. ఇంకా మిగిలిన సీట్ల భర్తీ కోసం మెరిట్ లిస్ట్‌లో తదుపరి ప్రతిభావంతులైన బాలురకు ఈ నెల 16న పూసపాటిరేగ మండలం కొప్పెర్ల డాక్టర్ బీఆర్అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో కౌన్సెలింగ్ నిర్వహిస్తామని, అదే విధంగా ఈ నెల 17న బాలికల కోసం చీపురుపల్లిలోని డాక్టర్ బీఆర్అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో కౌన్సెలింగ్ చేపడతామన్నారు. ఆయా రోజుల్లో ఉదయం 10 గంటల నుంచి కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. మెరిట్‌లిస్ట్‌లో ఉన్న తదుపరి విద్యార్థులు కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని, వారి మొబైల్ నంబర్లకు ఫోన్ చేసి, మెసేజ్ రూపంలో కూడా సమాచారం ఇచ్చామన్నారు. పూర్తి సమాచారం కోసం బాలికలైతే 8333033434 ఫోన్‌కు, బాలురు 6303838657 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం


ఘటనా స్థలంలో తహసీల్దార్లతో మాట్లాడుతున్న డీఎస్పీ

పాలకొండ రూరల్: ఎన్నికల విధులు ముగించుకుని మంగళవారం సాయంత్రం పార్వతీపురం నుంచి కారులో తిరిగి వస్తున్న పాలకొండ, సీతంపేట మండలాల తహసీల్దార్లు వరహాలు, మహేశ్వరరావులకు పెనుప్రమాదం తప్పింది. వారు ప్రయాణిస్తున్న కారు పాలకొండ మండలంలోని రాజుపేట వద్దకు చేరుకునే సమయానికి టైరు పంక్చర్ కావడంతో అదుపుతప్పి పక్కనే ఉన్న పంట పొలాల్లోకి దూసుకువెళ్లింది. అక్కడి స్థానికులు గమనించి కారులో ఉన్న వారిని బయటకు తీశారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ జీవీ.కృష్ణారావు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదంపై ఆరా తీశారు. మలుపు వద్ద కారు అదుపు తప్పినప్పటికీ లోపల ఉన్న అధికారులకు ఎటువంటి ప్రమాదం జరగక పోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. చిన్నచిన్న గాయాలు కావడంతో అధికారులు స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందారు.

రాయి మీద పడి ఉపాధి వేతనదారు మృతి

- మరొకరికి గాయాలు


మృతి చెందిన ఆదమ్మ

సీతంపేట: మండలంలోని బిల్లుగూడ కాలనీకి చెందిన సవర ఆదమ్మ (50) ఉపాధి పనులు చేస్తుండగా తలపై రాయి పడడంతో మృతిచెందింది. ఆమె పక్కన పనిచేస్తున్న సవర గంగమ్మకు గాయాలయ్యాయి. ఈ ఘటనపై ఏపీవో సాగర్ అందించిన వివరాలిలా ఉన్నాయి. మంగళవారం ట్రెంచింగ్ పనులు చేస్తుండగా ఒక్క ఉదుటున రాయి వారిద్దరిపై పడడంతో గాయాలపాలయ్యారు. వెంటనే కుశిమి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం పాలకొండ ఏరియా ఆస్పత్రికి రిఫర్ చేశారు. ఆదమ్మ పరిస్థితి విషమించడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. గంగమ్మ పాలకొండలో చికిత్స పొందుతోంది. మృతురాలికి భర్త తుంబయ్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ ఘటనపై పోలీసులకు కుటుంబసభ్యులు సమాచారమందించారు.

జోరుగా తాటి ముంజెల విక్రయం


తాటి కాయలు, ముంజెలు విక్రయిస్తున్న గీత కార్మికుడు

రామభద్రపురం: వేసవి తాపాన్ని తగ్గించే.. పోషకాలు మెండుగా లభించే తాటిముంజెలకు పల్లెలు, పట్టణాల్లో గిరాకీ నెలకొంది. గీత కార్మికులకు ఉపాధి కల్పిస్తున్నాయి. పొలాల్లోని తాటిచెట్లనుంచి సేకరించిన కాయలనుంచి ముంజెలను తీసి డజను రూ.30 చొప్పున విక్రయిస్తున్నారు. కాయ రూపంలో అయితే రూ.5కు అమ్ముతున్నారు. రోజుకు కనీసం రూ.600 వరకు సంపాదిస్తున్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యసేవలు



భోగాపురం సామాజిక ఆరోగ్య కేంద్రం

- ఏటా 10 లక్షల మందికి ఓపీ
- లక్ష నుంచి 1.30 లక్షల వరకు ఐపీ
- 7 వేల వరకు మేజర్ ఆపరేషన్లు
- 15 వేల వరకు ప్రసవాలు


గజపతినగరం ప్రాంతీయ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులు (ఫైల్)

విజయనగరం ఫోర్ట్: జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం చేపట్టిన చర్యల కారణంగా వైద్య విధాన్ పరిషత్ ఆస్పత్రుల్లో సేవలు మెరుగుపడ్డాయి. వైద్య విధాన్ పరిషత్ ఆస్పత్రుల్లో పూర్తి స్థాయిలో వైద్య సిబ్బందిని నియమించడం వల్ల రోగులకు సకాలంలో వైద్య సేవలు అందుతున్నాయి. అన్ని రకాల సేవలు రోగులకు అందుతుండడం వల్ల అధిక సంఖ్యలో ప్రభుత్వ ఆస్పత్రులకు వస్తున్నారు. ఈ నేపథ్యంలో ఓపీ, ఐపీతో పాట శస్త్రచికిత్సలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో పెరిగాయి.

2019 నుంచి 2024 మార్చి నెలాఖరు నాటికి అందించిన వైద్య సేవల వివరాలు

సంవత్సరం	ఓపీ	ఐపీ	ఆపరేషన్లు	ప్రసవాలు
2019-20	13,58,802	1,36,906	7807	15, 399
2020-21	8,22,354	1,03,139	5954	14,651
2021-22	11,64,864	1,34,159	6,784	14,513
2022-23	10,29,994	1,16,692	4362	8859
2023-24	11,28,345	1,17,720	4563	8985

సౌకర్యాలు కల్పించిన ప్రభుత్వం

వైద్య విధాన్ పరిషత్ ఆస్పత్రుల్లో ప్రభుత్వం మౌలికవసతులు కల్పించింది. ముఖ్యంగా ప్రతి సీహెచ్‌సీ, ప్రాంతీయ ఆస్పత్రిలో గైనకాలజిస్టు, పిడియాట్రిక్, అనస్తీషియా, జనరల్ ఫిజీషియన్, డెర్మటాలజీ, దంత, ఈఎన్‌టీ వైద్యులను నియమించడంతో అన్ని రకాల సేవలు అందుతున్నాయి. ఫలితంగా ఆస్పత్రికి వచ్చే రోగుల సంఖ్య పెరిగింది. ప్రసవాలు, సిజేరియన్లు, ఇతర శస్త్రచికిత్సలు, వైద్య పరీక్షలు అల్ట్రాసౌండ్, ఈసీజీ వంటి సేవలు పెరిగాయి.

జిల్లాలో 8 ఆస్పత్రులు

ఉమ్మడి విజయనగరం జిల్లాలో వైద్య విధాన్ పరిషత్ ఆస్పత్రులు (ఏరియా ఆస్పత్రులు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు) 14 ఉండేవి. జిల్లాల పునర్విభజన అనంతరం విజయనగరం జిల్లాలో 8 ఆస్పత్రులు ఉన్నాయి. వాటిలో ఎస్.కోట, గజపతినగరంలలో ప్రాంతీయ ఆస్పత్రులు, బాడంగి, భోగాపురం, నెమర్ల, చీపురుపల్లి, బొబ్బిలి, రాజాంలలో సీహెచ్‌సీలు ఉన్నాయి.

గణనీయంగా పెరిగిన ఓపీ సేవలు

వైద్య విధాన్ పరిషత్ ఆస్పత్రుల్లో ఏటా లక్షలాది మందికి వైద్య సేవలు అందుతున్నాయి. అందులో 10 లక్షల మందికి వరకు ఓపీ(ఔట్ పేషేంట్)సేవలు అందిస్తున్నారు. అదేవిధంగా లక్ష నుంచి 1.30 లక్షల మంది వరకు ఇన్‌పేషేంట్ (ఐపీ) సేవలు అందిస్తున్నారు. 6 వేల నుంచి 7 వేలు మేజర్ ఆపరేషన్లు చేస్తున్నారు. 14 వేల నుంచి 15 వేల వరకు ప్రసవాలు నిర్వహిస్తున్నారు. 35 వేల నుంచి 40వేల వరకు అల్ట్రాసౌండ్ స్కాన్ చేస్తున్నారు.11 లక్షల నుంచి 16 లక్షల వరకు వైద్య పరీక్షలు చేస్తున్నారు. ఎక్స్‌రేలు 40 వేల నుంచి 43 వేల వరకు, 20 వేల నుంచి 23 వేల వరకు ఈసీజీలు తీస్తున్నారు.

దళిత మహిళా సర్పంచ్‌పై జనసేన దాడి

- తెట్టంగిలో ఇరువర్గాల కొట్లాట
- సర్పంచ్‌తో పాటు వైఎస్సార్‌సీపీ కార్యకర్తకు గాయాలు
- ఇరువర్గాలపై కేసు నమోదు చేసిన పోలీసులు


జనసేన కార్యకర్తల దాడిలో గాయపడి పాలకొండ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సర్పంచ్ విజయమ్మ


జనసేన కార్యకర్తల దాడిలో స్వల్ప గాయాలై చికిత్స పొందుతున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్త

వీరఘట్టం: మండలవ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. అయితే తెట్టంగి గ్రామంలో మాత్రం జనసేన, టీడీపీ సభ్యులు కవ్వింపు చర్యలకు పాల్పడడంతో జరిగిన గొడవ కొట్లాటకు దారితీసింది.ఈ కొట్లాటలో దళిత మహిళా సర్పంచ్ అలజంగి విజయమ్మకు గాయాలు తగలడంతో ఆమె అపస్మారక స్థితికి చేరుకున్నారు.అయితే కవ్వింపు చర్యలు, గొడవల్లో గ్రామానికి చెందిన ఓ రెవెన్యూ ఉద్యోగి ప్రోద్బలం ఉందని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరోపిస్తున్నారు.ఇటీవల ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌లు గ్రామంలో చేపట్టిన ప్రచార ర్యాలీకి గ్రామస్తుల నుంచి విశేష స్పందన వచ్చింది. అయితే కూటమి సభ్యులకు అనుకూలంగా ఉన్న ఓ ఉద్యోగి వైఎస్సార్‌సీపీకి పెరుగుతున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక పోలింగ్ రోజున తగాదాకు ప్లాన్ చేసినట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. ప్రశాంతంగా జరుగుతున్న ఎన్నికలు ఎన్నడూ లేనివిధంగా తగాదాలకు దారితీశాయంటే ముమ్మాటికీ ఆ ప్రభుత్వ ఉద్యోగి కుట్రేనని సర్పంచ్ అలజంగి విజయమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరోపించారు. సదరు రెవెన్యూ ఉద్యోగి ఫోన్ కాల్ డేటాను పోలీసులు పరిశీలిస్తే వాస్తవాలు బయటకు వస్తాయని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

బాధితులకు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల పలకరింపు

ఈ కొట్లాటలో గాయపడిన సర్పంచ్ విజయమ్మ, కొందరు వైఎస్సార్‌సీపీ నాయకులు సోమవారం రాత్రి పాలకొండ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందారు. ఈ విషయం తెలియడంతో గాయాలపాలైన సర్పంచ్ విజయమ్మను, వైఎస్సార్‌సీపీ నాయకులను ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్‌లు ఫోన్ చేసి పలకరించారు.ఈ గొడవలకు కారకులైన వారిపై తగు చర్యలు చేపట్టాలని పోలీసులను కోరారు. అయితే తెట్టంగిలో సోమవారం పోలింగ్ కేంద్రం వద్ద జరిగిన తగాదాపై ఇరువర్గాలు పరస్పరం ఇచ్చిన ఫిర్యాదులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై షేక్ ఫక్రుద్దీన్ తెలిపారు. గ్రామంలో ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు తమ సిబ్బంది పహారా కాస్తున్నట్లు చెప్పారు.

రెండు కార్లు ఢీకొని ముగ్గురికి గాయాలు

బొండపల్లి: మండలంలోని బొడసింగిపేట గ్రామానికి సమీపంలో జాతీయ రహదారి 26పై మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎదురెదురుగా వస్తున్న రెండు కార్లు ఢీకొన్న ఘటనలో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. విశాఖపట్నం నుంచి బొబ్బిలి వెళ్తున్న కారు, గజపతినగరం నుంచి విజయనగరం వెళ్తున్న కారు ఎదురెదురుగా బలంగా ఢీకొనడంతో రెండు కార్లు కూడా పూర్తిగా నుజ్జునుజ్జయ్యాయి. ఈ ప్రమాదంలో ఒక వ్యక్తి కాలు విరిగి పోగా 108 వాహనంలో విజయనగరంలోని కేంద్ర సర్వజన ఆస్పత్రికి తరలించారు. మరో ఇద్దరిని గజపతినగరంలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకున్నారు.

రామతీర్థంలో వైభంగా పూర్ణాహుతి


యాగశాలలో పూర్ణాహుతి హోమాన్ని జరిపిస్తున్న అర్చకులు


వెండి మంటపం వద్ద స్వామి కల్యాణాన్ని జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: పుష్యమి నక్షత్రాన్ని పురస్కరించుకుని పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో ఆలయ అర్చకులు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున స్వామికి ప్రాతఃకాలార్చన, బాలభోగం నిర్వహించిన తరువాత..యాగశాలలో గత 27 రోజుల నుంచి జరుగుతున్న సుందరకాండ హవనం మంగళవారం పూర్తైన సందర్భంగా పూర్ణాహుతి కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం స్వామి సన్నిధిలో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని వేడుకగా జరిపించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు నరసింహాచార్యులు, సాయిరామాచార్యులు, మల్లికార్జునశర్మ, కిరణ్‌కుమార్, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ గెలుపుకోసం పనిచేసిన వారికి ధన్యవాదాలు


మాట్లాడుతున్న పీడిక రాజన్నదొర

- పీడిక రాజన్నదొర

సాలూరు: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపొందేందుకు శక్తివంచన లేకుండా పనిచేసిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు,పార్టీ అభిమానులు, ప్రజలు అందరికీ ధన్యవాదాలని, వారందరికీ శిరస్సు వంచి పాదాభివందనం చేస్తున్నానని వైఎస్సార్‌సీపీ సాలూరు అసెంబ్లీ అభ్యర్థి పీడిక రాజన్నదొర తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయనను సాలూరు పట్టణంలో గల ఆయన స్వగృహంలో నియోజకవర్గానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజన్నదొర విజయం తథ్యమని, మండలాల వారీగా పోలింగ్ తీరు తదితర నివేదికలను వివరించారు. ఈ సందర్భంగా రాజన్నదొర మాట్లాడుతూ, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల గెలుపుకోసం శక్తి వంచన లేకుండా పనిచేసిన అందరికీ ఎప్పుడూ అండగా ఉంటానని స్పష్టం చేశారు. ఎన్నికల వేళ టీడీపీ నాయకుల వల్ల కొందరు వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఇబ్బందులు పడ్డారని, వారందరికీ చివరివరకు ఎప్పుడూ అండగా ఉంటానని, అధైర్య పడవద్దని భరోసా ఇచ్చారు. సాలూరులో వైఎస్సార్‌సీపీ గెలుపు తథ్యమని, రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మళ్లీ కొలువుదీరుతుందని ధీమా వ్యక్తం చేశారు.

రాయల్ ఎన్‌ఫీల్డ్ దగ్ధం

కొత్తవలస: మండలంలోని కొత్తవలస–విజయనగరం రోడ్డులో ప్రమాదవశాత్తు రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్ మంగళవారం దగ్ధమైంది. కొత్తవలస మండల కేంద్రానికి చెందిన వెంకటరావు బైక్‌పై పనిమీద బయటకు వెళ్లి వస్తుండగా భారత్ డిఫెన్స్ అకాడమీ వద్దకు వచ్చేసరికి బైక్ నుంచి పొగలు రావడం గమనించి రోడ్డుపక్కకు తీసి ఆపాడు. అంతలోనే పెద్దఎత్తున మంటలు వ్యాపించాయి. ఆర్పేందుకు ప్రయత్నం చేసినా అదుపు చేయలేకపోయాడు. కొత్తవలస అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మంటలను అదుపు చేశారు. అయితే అప్పటికే బైక్ పూర్తిగా కాలిపోయింది.

పశువుల ఎరువుతో భూసారం పెంపు

- వేసవి దుక్కుతో మేలు


పశువుల ఎరువును పొలంలోకి తీసుకెళ్లేందుకు ట్రాక్టర్‌కు ఎక్కిస్తున్న రైతులు


వేసవి దుక్కు దుక్కు దున్నుతున్న రైతు

రామభద్రపురం: వ్యవసాయంలో రసాయన ఎరువుల వినియోగం పెరిగిపోవడంతో నేలలోని పోషకాల నిల్వల్లో సమతుల్యంలోపించి ఉత్పాదకత తగ్గుతోంది. చీడపీడలు ఆశించడం, సూక్ష్మ పోషకాల లోపాలతో దిగుబడులు తగ్గుతున్నాయి. ఈ సమస్యను అధిగమించాలంటే సేంద్రియ పద్ధతులను పాటించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు పేర్కొంటున్నారు.

సేంద్రియ ఎరువులతో సాగు

పశువులు, మేకలు, గొర్రెల ఎరువు పంటల సాగులో ఎంతగానో ఉపయోగపడుతుంది. ఇది సేంద్రియ ఎరువులతో సమానం.దీన్ని దుక్కులు దున్నడానికి ముందే పంట భూముల్లో వేసి దున్నితే చాలా మంచిది. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించడానికి వీలవుతుంది. దుక్కులు దున్నిన తర్వాత పశువుల పేడ మొత్తం భూమిలోకి వెళ్లి పంట దిగుబడిని పెంచడానికి దోహదపడుతుంది. పంట ఎదుగుదల, మొక్కలు బలంగా ఉండేందుకు పశువుల ఎరువు ఉపయోగపడుతుంది. ఒక ఎకరాకి నాలుగు నుంచి ఐదు ట్రాక్టర్ల పశువుల ఎరువును వినియోగించాలి.

భూసారం పదిలం

సాధారణంగా రైతులు వేసవిలో పశువుల ఎరువును వ్యవసాయ పొలాలకు తరలిస్తుంటారు. అదే సమయంలో ఎండలు ఎక్కువగా ఉంటాయి. అధిక ఎండల కారణంగా పొలంలో జల్లితే వాటిలో ఉన్న పోషకాలు ఆవిరవుతాయి. కాబట్టి పశువుల పేడను పొలంలో కుప్పలు పోసుకోవాలి. భూమిలో తగు తేమ ఉన్న సమయంలోనే వెదజల్లి వెంటనే దుక్కిలో కలియదున్నాలి. దీని వల్ల భూసారం పెరుగుతుంది. సహజసిద్ధమైన లక్షణాలు అందుతాయి. నేలలోని ఆమ్లత్వం, క్షారత్వం, నిటిని నిల్వ ఉంచే గుణాన్ని అదుపుచేసి పోషకాలు మొక్కలకు అందే విధంగా సహాయపడతాయి.దీంతో రైతులు తక్కువ ఖర్చుతో అధిక లాభాలు సాధించవచ్చు.


ఇలా దున్నాలి

పొలాన్ని ఎలా పడితే అలా దున్నడం వల్ల సాగుచేసే పంటలకు నష్టం వాటిల్లుతుంది. రైతులు వేసవి కాలంలో మెట్ట భూములను వానాకాలంలో సీజన్ కోసం సన్నద్ధం చేస్తుంటారు. మెట్ట ప్రాంతాల్లో భూమి వాలుకు అడ్డంగా దుక్కి చేయాలి. ఎందుకంటే వేసవిలో వచ్చే అధిక వర్షాలకు ఎంతో సారవంతమైన మట్టి నీటి వరదకు వాలు ప్రాంతంలో కొట్టుకుపోతుంది.వాలుకు అడ్డంగా దుక్కి దున్నితే నీటి ప్రవాహం తగ్గి మట్టి కొట్టుకుపోకుండా ఉంటుంది.

> **పశువుల ఎరువుతో భూసారం పెంపు**
>
> 
>
> పశువులు,మేకలు, గొర్రెల ఎరువు వేయడం వల్ల భూసారం పెరుగుతుంది. సహజసిద్ధమైన లక్షణాలు అందుతాయి.నేలలోని నిటిని నిల్వ ఉంచే గుణాన్ని అదుపుచేసి పోషకాలను మొక్కలకు అందే విధంగా సహాయపడతాయి. రైతులు తక్కువ ఖర్చుతో అధిక లాభాలు సాధించవచ్చు.
>
> – జ్యోత్స్న, గ్రామ వ్యవసాయ సహాయకురాలు

గ్రామాల్లో ద్రాక్ష పంట


వెంకటేశ్వర్లు ఇంటిముందు ద్రాక్షతీగలు


గుత్తులుగా ద్రాక్షపూత


గేదెల వెంకటేశ్వర్లు


నోరూరిస్తున్న రెడ్‌గ్రేప్

రాజాం/రేగిడి: ద్రాక్ష పంట తీగలను ఇప్పుడు గ్రామాల్లో పలువురు తమ ఇండ్ల వద్ద పెంచుతూ ఆకర్షణగా మలుస్తున్నారు. ప్రతి గ్రామంలో ద్రాక్ష పాదులు కనువిందు చేస్తున్నాయి. రేగిడి మండలంలోని ఉణుకూరు గ్రామానికి చెందిన జిల్లా వ్యవసాయ సలహామండలి అధ్యక్షుడు గేదెల వెంకటేశ్వర్లు తన ఇంటి ముందు భాగాన ద్రాక్షపాదులు వేశారు. రెండు సంవత్సరాల వయస్సు ఉన్న ఈ ద్రాక్ష తీగలు ఇంటిముందు పందిరిని అల్లుకుని గుత్తులుగుత్తులుగా పూతకు వచ్చాయి. ఇవి పలువురిని ఆకర్షిస్తున్నాయి. రెండేళ్ల క్రితం ఆన్‌లైన్‌లో ఈ ద్రాక్ష విత్తనాలను కొనుగోలు చేసినట్లు వెంకటేశ్వరరావు సాక్షికి తెలిపారు. ఓ వైపు ఇంటి ముందు అందంతో పాటు మరో వైపు చల్లదనాన్ని ఈ తీగలు అందిస్తున్నాయి. పండిన రెడ్ గ్రేప్ చాలా తియ్యగా ఉంటున్నాయని ఆయన తెలిపారు.

నాగావళి నది పరిసర ప్రాంతాల్లో ఏనుగులు


బాసంగి దగ్గర ఉన్న నాగావళి నది పరిసర ప్రాంతంలో ఉన్న ఏనుగులు

జియ్యమ్మవలస: మండలంలోని బాసంగి గ్రామ సమీపంలోని నాగావళి నదిలో ఏనుగులు మంగళవారం మధ్యాహ్నం వరకు సేదతీరాయి. సాయంత్రానికి అరటి, పామాయిల్ తోటలోకి చేరుకున్నాయి. ఏనుగుల సంచారంతో అరటి పంటకు నష్టం వాటిల్లుతుండడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఏనుగులను తరలించే ప్రయత్నం చేయాలని కోరుతున్నారు.

చెరువుల్లో వర్షపు నీరు


నేడు నీరు చేరిన గురండి సీతామహాలక్ష్మి చెరువు

భామిని: గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఏజెన్సీలో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. కొన్నిచోట్ల భారీ వర్షం కురవడంతో చెరువుల్లో నీరు చేరింది. దీనివల్ల వేసవిలో పశువులకు తాగునీటి కష్టాలు ఉండవని రైతులు చెబుతున్నారు.